# శ్రీ బూరగడ్డ వేదవ్యాస్

శ్రీ బూరగడ్డ వేదవ్యాస్ తొమ్మిదవ శాసనసభ (1989-1994) డెప్యూటీ స్పీకర్‌గా 1993, డిసెంబరు 29న ఏకగ్రీవంగా ఎన్నికై 1994, డిసెంబరు 10 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు 1959, సెప్టెంబరు 26న భీమవరంలో జన్మించారు.

శ్రీ వేదవ్యాస్ ప్రాథమిక విద్యను మచిలీపట్నంలోను, బి. ఎ. డిగ్రీని హైదరాబాదులోని ఎ.వి. కళాశాలలోను చదివారు. బి. ఎల్. డిగ్రీని ఏలూరు సి.ఆర్. కళాశాలలో పూర్తి చేసిన అనంతరం మచిలీపట్నంలో న్యాయవాదిగా పనిచేసారు.

వీరు 1989వ సంవత్సరములో కృష్ణా జిల్లా మల్లేశ్వరం నియోజకవర్గం నుండి మొదటిసారిగా శాసనసభకు ఎన్నికైనారు. శ్రీ వేదవ్యాస్ కొంతకాలము ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్థ డైరెక్టర్‌గా ఉన్నారు. అలాగే వీరు వివిధ శాసనసభ కమిటీలలో సభ్యునిగా కూడా ఉన్నారు.

శ్రీ వేదవ్యాస్ డెప్యూటీ స్పీకర్ హోదాలో 1993-94 సంవత్సరంలో అర్జీల కమిటి అధ్యక్షునిగా ఉన్నారు.

వీరు 2004 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో మల్లేశ్వరం నియోజకవర్గం నుండి రెండవసారి ఎన్నికై ప్రస్తుతం 2004-2005 శాసనసభ అంచనాల కమిటి అధ్యక్షులుగా ఉన్నారు.

## శ్రీ బూరగడ్డ వేదవ్యాస్ డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, గౌరవ సభ్యులకు కృతజ్ఞత తెలుపుకొనే అవకాశం కూడా నాకు ఇవ్వకపోతే ఎట్లా ? ఉప సభాపతి పదవికి నా పేరును ప్రతిపాదించిన గౌరవ ముఖ్యమంత్రి విజయభాస్కర రెడ్డి గారికి, ఆర్థిక శాఖామాత్యులు రోశయ్యగారికి, మంత్రివర్యులు డి. శ్రీనివాస్‌గారికి, మంత్రివర్యులు బేగ్ గారికి, చీఫ్ విప్ గారికి, జె.కె. రెడ్డి గారికి, పువ్వాడ నాగేశ్వరావు గారికి, బోడేపూడి వెంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు. నన్ను ఏకగ్రీవంగా ఉప సభాపతి పదవికి ఎన్నుకొన్నందుకు అన్ని పక్షాల వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో శాసనసభ అత్యున్నతమైన స్థానం, ఒక దేవాలయం. ప్రజల సమస్యల్ని గురించి చర్చించి, ప్రజల క్షేమం, సంక్షేమం కొరకు నిర్ణయాలు తీసుకోవలసింది ఈ శాసనసభ. ఎంతో మంది పెద్దలు, మహానుభావులు సభాపతి, ఉపసభాపతి పదవులు నిర్వహించడానికి చిన్న వయస్సు కలిగిన నన్ను ఉపసభాపతిగా ఎన్నుకొన్నందుకు మీ అందరికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. నేను పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత విలువలు కలిగినటువంటి శాసనసభను రాగద్వేషాలకు అతీతంగా నిష్పక్షపాతంగా నిర్వహించి అందరి మన్ననలను పొందుతాననీ, అందరి ఆదరాభిమానాలను చూరగొంటానని మనవిచేస్తున్నాను. ఈ 20వ శతాబ్దంలో ఐరోపా, ఏషియా దేశాలలో జరిగే మార్పులు చూస్తుంటే ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఈ ప్రపంచంలోని ఏ దేశమైనా మనగలుగుతుందని ప్రపంచంలోని అనేక దేశాల ప్రజలు ప్రజాస్వామ్యంవైపే మొగ్గుచూపుతున్నారు. అలాంటి పరిస్థితులలో మనది చక్కటి సాంప్రదాయం కలిగిన ప్రజాస్వామ్యం. ఇంకా పటిష్టంగా ఉండి అనేకమైన మంచి నిర్ణయాలు తీసుకోవాలి. ఈ మధ్యకాలంలో కొన్ని అపశృతులు వినబడుతున్నా ఇక్కడి మన ప్రవర్తనా, నడవడి ప్రజలందరూ చూస్తారు కనక మనం ఈ సభను హుందాగా నడిపి, అందరం మంచి పేరు తెచ్చుకొనే విధంగా వ్యవహరించాలని ఆకాక్షింస్తున్నాను. సభాపతికిగానీ, ఉప సభాపతికిగానీ సంక్రమింపజేసిన అధికారాలు సభను చక్కగా నిర్వహించేందుకే కాబట్టి గౌరవ సభ్యులంతా అందుకు సహకరించి సభను చక్కగా నడిపించే అవకాశాన్ని కలుగజేయవలసిన అవసరం కూడా ఉంది. చక్కటి సాంప్రదాయాలు కలిగినటువంటి మన సభకు నన్ను ఎన్నుకొన్నందుకు తప్పకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాననీ, నన్ను మరీ మరీ అభినందిస్తూ మాట్లాడిన పెద్దలందరికి, ముఖ్యంగా మన ముఖ్యమంత్రి విజయభాస్కర రెడ్డి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటూ ముగిస్తున్నాను.